# పరిహారం

''ఆ కిళ్లీ కొట్టు దగ్గర ఎప్పుడు చూసినా అంత మందుంటారేం'' అడిగాడు రాఘవులు ఏమీ తెలియనట్టు అమాయకంగా.

నిజానికి ఆ కొట్టు దగ్గర జనం అలా ఎందుకు గుమిగూడ్తారో, కిళ్లీలు ఎన్నడూ నమలనివాడిక్కూడా ఆ కొట్లో కూర్చున్న సరోజను చూస్తే ఎందుకు నమలాలనిపిస్తుందో రాఘవులుకు తెలుసు. తెలిసినా తెలియనట్టు నటించడం అతనికి చాలా ఇష్టమైన పని.

''వాళ్లంతా వెళ్లేది కిళ్లీల కోసం కాదురా! ఆ కిళ్లీలు కట్టిచ్చే సరోజ కోసం. గుడ్లకొచ్చిన కోడిపెట్టలా భలే రంజుగా ఉంటదిలే... కాని ఏం లాభం? దాని వయసంతా అడవిగాచిన వెన్నెలే!'' అన్నాడు సారయ్య.

''ఎందుకూ?'' అన్నాడు రాఘవులు.

''లారీ అక్సిడెంట్‌లో దాని మొగుడు పోయాడ్లే. ఆ గొడవంతా మనకెందుగ్గాని త్వరగా పదండి... టైమైపోయింది. ఈపాటికి పెద్దాయన షాప్ తీసుంటాడు'' అన్నాడు సాంబయ్య.

''నీకెప్పుడూ తొందరేనే సాంబన్నా! మనమూ ఆ షాప్ దాకా వెళ్లి కిళ్లీలు కట్టించుకొని వెడదాం'' అన్నాడు రాఘవులు.

''నీకు బుద్ధిలేదురా రాఘవులూ! ఉపేంద్రయ్యగారు నా మొహం చూసి నిన్ను తన షాపులో పెట్టుకున్నాడు. ఉద్యోగంలో చేరి వారం రోజులు కూడా కాలేదు... లేటుగా వెడ్తే ఆయన నిన్ను కాదు... నన్ను తిడ్తాడు'' అన్నాడు సాంబయ్య.

''ఫరవాలేదులేవే... ఒక్క నిముషంలో కొంపలంటుకుపోవు'' అన్నాడు రాఘవులు తన సైకిల్ను ఆ కిళ్లీ కొట్టువైపు మళ్లిస్తూ.

''ఏమిరోయ్ రాఘవులు! చూడబోతే అమాయకుడిలాగే ఉన్నావు... ఈ ఊరొచ్చి వారం రోజులు కూడా కాలేదు. అప్పుడే లైట్లు కొట్టబోతున్నావా? ఆ సరోజతో పిచ్చిపిచ్చి వేషాలు వేశావంటే ఝాడించి తంతుంది. జాగ్రత్త! ఒకసారి కిళ్లీలు కట్టించుకోవడానికొచ్చిన ఓ రౌడీ వెధవ దాంతో సరసమాడబోయాట్ట... అదేం చేసిందో తెలుసా? కిళ్లీలో వేసే జర్దాలో ఏదో కలిపి వాడికిచ్చిందట. అది నోట్లో పెట్టుకుని నమలగానే వాడు గిరగిర తిరిగి అడ్డం పడిపోయాట్ట. దాని జోలి కెళ్లావో... నీ గతి అంతే అవుతుంది'' అన్నాడు సారయ్య.

''ఛీ ఛీ! అంత బుద్ధిలేని పని నేనెందుకు చేస్తాను. ఓ కిళ్లీ కట్టించుకుని వచ్చేస్తానంతే'' అన్నాడు రాఘవులు.

''త్వరగా రారా నాయనా! నీకోసం నేను తిట్లు తినాలి'' అంటూ సాంబయ్య, సారయ్య వాళ్ల సైకిళ్లమీద వేగంగా వెళ్లిపోయారు.

రాఘవులు సరోజ కిళ్లీకొట్టు ముందుకెళ్లి నిల్చున్నాడు. అతడు వెళ్లేటప్పటికి అక్కడ ముగ్గురు వ్యక్తులు... ఒకరు సిగరెట్ల కోసం, మరొకరు కిళ్లీ కోసం, ఇంకొకరు సోడా కోసం నిల్చుని ఉన్నారు. సరోజ ఒకరి తర్వాత ఒకరికి వాళ్లకు కావలసినవి అందిస్తోంది.

రాఘవులు ఆమెనే కన్నార్పకుండా చూస్తున్నాడు. అతనికి అందమైన ఆడవాళ్లను చూస్తే ఏమాత్రం అవకాశం ఉన్నా వాళ్లతో పరిచయం చేసుకోవాలనిపిస్తుంది. వారం రోజులుగా ఆ వీధిగుండా వస్తూపోతూ అతడు సరోజను చూశాడు. తనా ఊరికి కొత్తగా వచ్చాడు. సాంబయ్య సహాయంతో ఉపేంద్రయ్య బట్టలషాపులో సేల్స్‌మన్‌గా ఉద్యోగం సంపాదించాడు.

తనకంటే ముందొచ్చిన ఆ ముగ్గురు వ్యక్తులు వెళ్లిపోగానే ''ఓ మంచి మీఠాపాన్ కట్టండి'' అన్నాడు రాఘవులు.

ఆమె అతడికేసి చూడకుండానే తమలపాకులు తీసుకుని సున్నం రాయడం మొదలెట్టింది.

అతనికి ఆమెతో ఏదన్నా సంభాషణ మొదలెట్టాలనిపించింది. తను ప్రస్తుతం సారయ్య, సాంబయ్య వాళ్ల రూమ్‌లో ఉంటున్నాడు. రేపు సాంబయ్య తన పెళ్లాం పిల్లల్ని తీసుకొస్తే తనను వేరే రూమ్ చూసుకోమంటాడు. ఈ ఆలోచన రాగానే రాఘవులు -

''ఏమండీ! ఇక్కడేవన్నా చిన్న రూమ్ అద్దెకు దొరుకుతుందా?'' అన్నాడు.

''ఎవరిక్కావాలి?'' అందామె చకచకా తన పని తాను చేసుకుంటూ.

''నాకే కావాలండి'' అన్నాడు ఆమెను తన కళ్లతో తాగేస్తున్నట్టుగా చూస్తూ.

ఆమెకు పాతికేళ్లు కూడా ఉంటాయో ఉండవో... తెల్లచీరా, తెల్ల జాకెట్ వేసుకుంది. పొడుగ్గా ఉన్న వెంట్రుకల్ని ముడిచి శిఖ వేసుకుంది. మొహాన బొట్టు లేదు. ఆమె శరీరపు ప్రతీ అవయవంలో యౌవనం వెల్లివిరుస్తోంది. చామనఛాయ... ఎంతో కళగా ఉన్న కోలమొహం - తళతళ మెరుస్తున్న కళ్లు, తీర్చిదిద్దినట్టున్న కనుబొమలు, చక్కని ముక్కు... బలమైన ఆమె వక్షోజాల్ని ఆమె పైట కొంగు దాచలేకపోతోంది అనుకున్నాడు రాఘవులు.

''అద్దెంతివ్వగలవు?'' అందామె అతని చేతికి కిళ్లీ అందిస్తూ -

ఏదో ఉబుసుపోకకు తనడిగితే నిజంగానే రూమ్ దొరికేట్టుంది అనుకుంటూ ''ఓ యాభై వరకివ్వగలను'' అంతకంటే తక్కువంటే ఆమె దృష్టిలో చులకనైపోతానేమోననుకుని.

''పెళ్లాం పిల్లలున్నారా?'' అందామె ఈసారతన్ని పరిశీలనగా చూస్తూ, పైజామా,

హాఫ్‌షర్ట్ వేసుకున్నాడు. పాతికేళ్ళుంటాయేమో... చూడటానికి మాత్రం బుద్ధిమంతుడిలాగే ఉన్నాడు అనుకుందామె.

''అబ్బే లేదండి... నాకింకా పెళ్ళే కాలేదు'' అన్నాడతడు నోట్లో కిళ్లీ వేసుకొని, జేబులోంచి చార్మినార్ సిగరెట్ పాకెట్ తీసి ఓ సిగరెట్ వెలిగించుకుంటూ.

''ఒక్కడివే ఉంటావన్నమాట. అయితే రూంలేదు, గీం లేదు'' అందామె నువ్వికవెళ్లిపోవచ్చునన్నట్టుగా.

''ఒక్కడినే కాదండి - నాతోబాటు మా చెల్లెలు కూడా ఉంటుంది. నేనేమన్నా కాలేజీ కుర్రాడిననుకున్నారా ఒక్కణ్నే ఉంటూ అల్లరి చిల్లరి పనులు చెయ్యటానికి. నేనిక్కడ ఉపేంద్రయ్యగారి బట్టలకొట్లో సేల్స్‌మన్‌గా వారం రోజుల క్రితమే కుదిరాను. ప్రస్తుతం మా ఫ్రెండింట్లో ఉంటున్నాను. మీకు పుణ్యముంటుంది. మీ దృష్టిలో రూమేదన్నా ఉంటే చూపించండి'' అన్నాడతను బతిమాలుతున్న ధోరణిలో.

''మీ చెల్లెను తీసుకొచ్చి నీతో బాటు ఉంచుకుంటానంటేనే ఇస్తాను. మా ఇంట్లోనే నిన్ననే ఓరూమ్ ఖాళీ అయింది. అద్దె యాభై రూపాయలు. ఒకటే ఒక రూమ్. మధ్యాహ్నం ఒంటిగంటకు నేను భోజనానికి వెళ్లినప్పుడొస్తే చూపిస్తాను'' అందామె. వెంటనే అతనికి తన రొట్టె విరిగి నేతిలో పడిందనిపించింది.

''చాలా చాలా థాంక్సండి... మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేను. ఈ సంతోషంలో మీ చేతినుండి మరో కిళ్లీ కట్టించుకోకుండా ఉండలేను. ఇంకో మీఠా పాన్ కట్టివ్వండి'' అన్నాడతడు హుషారుగా.

ఆమె ఇంకో కిళ్లీ కడ్తుండగా సిగరెట్టు కావాలని ఒకాయనొచ్చాడు. జర్దాపాన్ కావాలని ఇంకొకాయనొచ్చాడు.

రాఘవులు కోసం మరో కిళ్లీ కట్టి ఓ కాగితంలో దాన్ని ప్యాక్ చేసి అతని చేతికిచ్చింది. ఆమెకు రెండు కిళ్లీల డబ్బులిచ్చేసి ''సరిగ్గా ఒంటిగంటకొచ్చి రూమ్ చూస్తాను'' అని చెప్పి రాఘవులు వెళ్లిపోయాడు.

★★★

రాఘవులు సరిగ్గా ఒంటిగంటకు సరోజ కిళ్లీ కొట్టు దగ్గరకొచ్చాడు. ఆ కొట్లో వాళ్ల తమ్ముణ్ణి కూర్చోబెట్టి సరోజ ఆ కొట్టు పక్కనే ఉన్న చిన్న పెంకుటింట్లోకి దారితీసింది. అది చాలా పాతిల్లు. మట్టిగోడలతో కట్టిన కాంపౌండ్ అక్కడక్కడ కూలిపోయింది. పైన పెంకులు కొన్ని లేచిపోయాయి. ఇంటికి ద్వారాలు తప్ప కిటికీలు లేవు. ఆ ఇంట్లో మొత్తం మూడు గదులున్నాయి. అందులో రెండు గదులు కలిసున్నాయి. ఒక గది విడిగా ఉంది. అంతకుముందురోజే ఆ గదిలో ఉన్న కుటుంబం తమకాగది సరిపోవటం లేదని ఖాళీచేసి వెళ్లిపోయారు.

రూమ్ చూడగానే తనకు నచ్చిందన్నాడు రాఘవులు. వెంటనే యాభై రూపాయలు

ఎడ్వాన్స్ కూడా ఇచ్చేశాడు.

''ఈ సాయంత్రమే వచ్చేస్తానండీ... మా చెల్లెను తీసుకురావడానికి మాత్రం ఓ అయిదారు రోజులు పడ్తుంది. మా ఉపేంద్రయ్యగారి సంగతి మీకు తెలుసుగా. ఇవ్వాళ కాస్త లేటుగా వెళ్లినందుకే టాప్ లేచిపొయ్యేలా కేకలేశాడు. ఆదివారం తప్ప ఒక్కరోజు కూడా సెలవివ్వడు. ఆదివారం వస్తే తప్ప మా ఊరెళ్లి మా చెల్లెను తీసుకురావడానికి వీలుకాదు'' అన్నాడు రాఘవులు.

సరోజ అతని మాటకు అంగీకరించింది. అతడు వెళ్లిపోగానే సరోజ వాళ్లమ్మ రాధమ్మతో-

''ఎవరోగాని వట్టి వెర్రిబాగులవాడిలా ఉన్నాడే. యాభై రూపాయలనగానే కొంచెమన్నా బేరమాడకుండా ఎడ్వాన్స్ ఇచ్చేశాడు. పోయినవాళ్లు ఇరవై అయిదు ఇచ్చారుగదా... ఈసారి ఓ పది పెంచేసి ముప్పై అయిదుకిద్దామనుకున్నాను. ఈ దిక్కుమాలిన రూమ్‌కు యాభైరూపాయలు పెట్టేవాడు దొరుకుతాడని కలలో కూడా అనుకోలేదే అంది.

''దిక్కుమాలిన రూమేమిటే... ఏ వస్తువు ధర చూసినా మండిపోతోంది. ఇదీ అంతే'' అంది రాధమ్మ.

మధ్యాహ్నం వేళలో సరోజ భోజనానింటికొచ్చినప్పుడు వాళ్ల తమ్ముడు షాపులో కూర్చుంటాడు. వాడికి పన్నెండేళ్లుంటాయి. బళ్ళోవేస్తే చదువు వంటబట్టలేదు. అందుకని అక్కకు సహాయంగా వాణ్నికూడా ఆ షాపులోనే ఉండమన్నారు. సాయంకాలం నాలుగు గంటలదాకా ఇంట్లోనే ఉండి నాలుగింటికి షాపుకొచ్చి రాత్రి తొమ్మిదింటిదాకా ఉంటుంది.

సరోజ వాళ్లనాన్న అయిదేళ్ల క్రితమే చనిపోయాడు. అతడు ఆ ఊరి సోడా కంపెనీలో పనిచేస్తూ సోడాబండి నడిపేవాడు. ఎప్పుడో వాళ్లనాన్న కట్టించిన ఇల్లుంది. అకస్మాత్తుగా పక్షవాతం వచ్చి అతడు చనిపోయేనాటికి సరోజకింకా పెళ్లికాలేదు.

సరోజ వాళ్లమ్మ రాధమ్మ వాళ్ల అన్న సహాయంతో ఓ సంబంధం చూసి సరోజ పెళ్లి చేసింది. కానీ ఆమె పెళ్లయి సంవత్సరం తిరక్కుండానే లారీ డ్రైవర్‌గా పనిచేసే ఆమె భర్త లారీ ఆక్సిడెంట్‌లో చనిపోయాడు. సరోజ వెంటనే వాళ్లమ్మ దగ్గరికొచ్చేసింది. రాధమ్మ వాళ్లన్నయ్య కిళ్లీకొట్టు పెట్టుకోండని సలహా ఇచ్చి అందుక్కావాల్సిన పెట్టుబడి కూడా అందజేశాడు. సరోజ వెంటనే కిళ్లీకొట్టు పెట్టి వాళ్లమ్మను, తమ్ముణ్ని పోషించుకుంటోంది. సహజంగా చురుకైన సరోజకు కిళ్లీకొట్టు ద్వారా మంచి లాభాల్ని సంపాదించడం ఏమంత కష్టం కాలేదు.

రాఘవులు ఆ సాయంత్రమే తన పెట్టేబేడా సర్దుకుని ఆ రూమ్‌లో చేరిపోయాడు. రూమ్‌లో చేరిన మొదటిరోజు నుండే రాఘవులు సరోజతోనూ, రాధమ్మతోనూ చాలా కలుపుగోలుగా, చనువుగా ఉండటానికి ప్రయత్నించాడు.

వీలైనప్పుడల్లా సరోజతో ''భగవంతుడు మీకు అన్యాయం చేశాడండి. లేకపోతే

సౌభాగ్యవతిలా పసుపు కుంకుమలతో కళకళ్లాడుతూ ఉండాల్సిన మీకు ఈ గతేమిటి చెప్పండి'' అంటుండేవాడు. అలా అన్నప్పుడల్లా సరోజ మౌనంగా ఉండటం తప్ప ఏమీ మాట్లాడేది కాదు.

ఇదేమాట రాఘవులు రాధమ్మతో అన్నప్పుడు ''అవున్నాయనా! దాని కర్మట్లా ఉంది. ఏం చేస్తాం?'' అంటుండేది.

''ఏమండీ! మీరేమి అనుకోకపోతే ఒకమాట. సరోజకేం తక్కువని? అందంగా లేదా? వయస్సు మళ్లిపోయిందా? ఆమెకు మళ్ళీ పెళ్ళెందుకు చేయకూడదు? ఈ రోజుల్లో అలాంటి పెళ్లిళ్లు చాలా మామూలైపోయాయి'' అంటాడు రాఘవులు.

''నిజమే నాయనా! అందరూ చెప్పేవాళ్ళేగాని చేసేవాళ్ళెవరు?'' అంటుంది రాధమ్మ.

''ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు రాధమ్మగారూ! సరోజను చేసుకుంటానని వచ్చేవాడు మీకు తెలియకుండా మీ చుట్టుపక్కల్లోనే మసలుతుండవచ్చు'' అనేవాడు రాఘవులు.

రోజూ పొద్దున్నే 9 గంటలకే తయారై తను పనిచేసే బట్టలషాపుకెళ్లిపోయేవాడు రాఘవులు. మళ్లీ రాత్రి తొమ్మిది గంటలకొచ్చేవాడు. ఆ ఇంట్లో చేరిన వారం పది రోజుల్లో ఇతడు చాలా బుద్ధిమంతుడే అనే అభిప్రాయాన్ని సరోజలోను, రాధమ్మలోను కల్గించగల్గాడు.

అతడు ఇంట్లో చేరిన తర్వాత వచ్చిన మొదటి ఆదివారం వాళ్ల సేట్ యేదో పనుందని షాపుకు రమ్మన్నాడని, ఈ రోజు మా ఊరెళ్లడం సాధ్యం కాదని, వచ్చే ఆదివారం వెళ్లి మా చెల్లెలును తీసుకొస్తానని చెప్పాడు. అందుకు రాధమ్మ వెంటనే 'సరే' అంది.

ఆ తర్వాతొచ్చిన ఆదివారంనాడు వాళ్ళూరుకు బయల్దేరాడు రాఘవులు.

''మీదే ఊరు నాయనా?'' అడిగింది రాధమ్మ.

''మన వరంగల్‌కు చాలా దగ్గరేనండి. రాయపర్తి'' అన్నాడు రాఘవులు.

''అమ్మా, నాన్న ఉన్నారా?'' అంది రాధమ్మ.

''నాయనగారెప్పుడో పోయారు. అమ్మ, ఇద్దరు చెల్లెళ్లున్నారు. ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం మాది. బాగా తాగుడుకు అలవాటుపడిపోయి మా నాయన సంసారమంతా పాడుచేశాడు. ఇప్పుడేం లేదు ఒక్క ఇల్లు తప్ప. అమ్మ కూలినాలి చేసుకుని బతుకుతోంది. నేను ఎలాగో పదో తరగతి పూర్తిచేసి ఏదైనా ఉద్యోగం దొరకుతుందేమోనని ఈ ఊరొచ్చి ఉపేంద్రయ్య బట్టలకొట్లో చేరాను'' అన్నాడు రాఘవులు.

''చెల్లెళ్ళు పెళ్ళికెదిగారా?'' అంది రాధమ్మ.

''ఆ... మా అమ్మకెప్పుడూ అదే మనాది. పెద్దదానికి పదహారేళ్లుంటాయి. చిన్నదానికి పధ్నాలుగేళ్లుంటాయి... నే వెళ్లి పెద్దదాన్ని తీసుకొస్తానండి'' అంటూ రాఘవులు వాళ్ళూరికి

బయల్దేరాడు.

వెళ్లిన మర్నాడు ఉదయం 8 గంటలకే తిరిగొచ్చాడు.

ఇంట్లో అడుగుపెడ్తూనే సరోజను, రాధమ్మను చూసి భోరుమని ఏడ్చాడు రాఘవులు.

''ఏమైంది నాయనా... ఏమైంది?'' అంటూ చేస్తున్న పని వదిలేసి అతని దగ్గరికొచ్చింది రాధమ్మ.

''నేను వెళ్లేటప్పటికే వాంతులు, విరేచనాలు పట్టుకొని మా పెద్ద చెల్లెలు చనిపోయిందండి'' అంటూ మళ్లీ బావురుమన్నాడు.

రాధమ్మకు, సరోజకు అతనిమీద విపరీతమైన జాలి కల్గింది. చాలాసేపటి వరకు వాళ్లతన్ని ఓదార్చారు. ఎలా చనిపోయిందో వివరాలడిగారు. ఓ గంట తర్వాత రాఘవులు తేరుకొని ''మా సేట్ సంగతి మీకు తెలుసుగా... చెల్లె చచ్చిపోయిందని నేను ఊళ్లో ఏడుస్తూ కూర్చొంటే వాడు నన్ను ఉద్యోగంలోంచి పీకేస్తాడు. ఈ కాస్త ఆధారం కూడా పోతుందని వచ్చేశాను'' అంటూ షాపుకు బయల్దేరాడు.

రాధమ్మ ఆరోజునుండి రాఘవులును వంట చేసుకోనివ్వలేదు. అతనిక్కూడా తనే వంటచేసి అతని రూమ్‌లోకి తెచ్చి వడ్డించడం మొదలెట్టింది. మొదట్లో ''మీకెందుకండి ఈ శ్రమ'' అంటూ చాలా మొహమాటపడ్డాడు రాఘవులు. తర్వాత ''సరే... మీరే భోజనం పెట్టండి కానీ అద్దెతోపాటు ఇంకో యాభైరూపాయలు అదనంగా ఇస్తాను. మీరు వద్దనకూడదు'' అన్నాడు.

రాధమ్మ 'సరే'నంది.

ఒకరోజు వంట్లో నలతగా ఉందని సరోజ షాపుకెళ్లకుండా ఇంట్లోనే పడుకుంది. రాధమ్మకు చాలా రోజులుగా మనసులో వున్నమాటను సరోజతో చెప్పేసింది.

''కుర్రాడు చాలా బుద్ధిమంతుడిలా ఉన్నాడే... నిన్ను చేసుకుంటే నా బాధ తీరేది. ఇద్దరూ అంతో ఇంతో కష్టం చేసుకుని హాయిగా బతికేవాళ్లు'' అంది రాధమ్మ.

''నీ పిచ్చిగాని ఓసారి పెళ్ళయి మొగుడు చచ్చిందాన్ని ఎవరు చేసుకుంటారే! నన్ను చేసుకోవడం వల్లనే ఆ ఆక్సిడెంటయిందని అందరూ నన్నే అన్నారు. మళ్లా ఎవడైనా చేసుకుంటానని వచ్చినా 'దాన్ని చేసుకుంటే నువ్వూ చస్తావురా' అని భయపెడతారు మన చుట్టుపక్కలవాళ్లు'' అంది సరోజ.

''ఎందుకనో... నాకు రాఘవులుకు నీమీద మనసుందని, ఆ కుర్రాడు ఏదో ఒకరోజు నిన్ను చేసుకుంటానని ముందుకొస్తాడని నమ్మకం ఉంది. అతడలా అడిగిన్నాడు నువ్వేం బెట్టుచెయ్యకుండా వెంటనే ఒప్పేసుకో'' అంది రాధమ్మ.

''అతడంతవరకొచ్చినప్పుడు చూద్దాంలేవే'' అంది సరోజ.

★ ★ ★

రెండు నెలలు గడిచాయి.

ఆ రోజు రాఘవులు షాపునుండి 11 గంటలకే ఇంటికొచ్చాడు. కొన్ని రాజకీయ పార్టీలవాళ్లు బంద్ జరపాలని వత్తిడి చెయ్యటంవల్ల ఆరోజు ఉపేంద్రయ్య తన బట్టల షాపును పదిన్నరకే మూయించేశాడు.

రాఘవులు ఇంటికొచ్చేటప్పటికి సరోజ కూడా ఇంట్లోనే వుంది. రాధమ్మ ఆ ఉదయమే మా అన్నను చూసొస్తానని వాళ్ళూరు వెళ్లింది.

''ఈ వేళప్పుడు పడుకున్నారేమిటి?'' అన్నాడు తనింట్లోకి రాగానే మంచంమీద పడుకుని వున్న సరోజతో.

''ఎందుకో విపరీతమైన తలనొప్పి... షాపుల్లో తమ్ముని కూర్చోబెట్టి వచ్చాను'' అంది సరోజ.

''తలనొప్పయితే ఓ ఆస్ప్రో గోలేసుకొని టీ తాగాలి. నే వెళ్లి తెస్తానుండండి'' అంటూ బయటికెళ్లాడు. - ''ఎందుకండీ! కాస్సేపయితే అదే తగ్గిపోతుంది' అంటున్న సరోజ మాట వినిపించుకోకుండానే.

అతడు బయటికెళ్లి ఓ షాపులో ఆస్ప్రోగోలి కొనుక్కొని, హోటల్ కుర్రాడితో టీ పట్టించుకుని వచ్చాడు. సరోజ చేత ఆ మాత్ర మింగించి హోటల్ కుర్రాడిని పంపించాడు.

''ఇప్పుడెలా ఉంది'' అన్నాడు రాఘవులు.

''పరవాలేదు... కొంచెం తగ్గింది. మీరు చాలా త్వరగా వచ్చారే! షాపు లేదా?'' అంది సరోజ.

''ఈరోజు వరంగల్ బంద్‌ట. మెయిన్‌రోడ్‌లోని షాపులన్నీ మూసేశారు'' అన్నాడు రాఘవులు.

''వీళ్లకేం రోగమో... ఎప్పుడూ బంద్‌లే'' అంది సరోజ.

''చూశారా! కష్టమొచ్చినా, సుఖమొచ్చినా తోడనేది ఉండాలి. ఇప్పుడు నేను రాకపోతే మీరలాగే తలనొప్పితో బాధపడ్తుండేవాళ్లు. ఏమండీ! మీరేమీ అనుకోకపోతే నేనోమాట అడుగుతాను. అడగమంటారా?''

''అడగండి''

''మీకోసారి పెళ్లయిందని, మీ భర్త చనిపోయాడని, అందుచేత మీరు మళ్ళీ పెళ్లి చేసుకోకుండా జీవితాంతం ఇలానే ఉండాలనటం చాలా ఘోరమైన అన్యాయం. భార్య చనిపోయిన భర్త మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నప్పుడు భర్త చనిపోయిన భార్యెందుకు చేసుకోకూడదు? ఏమంటారు?''

''మీరనేది నిజమే... కాని భర్త చనిపోయిన స్త్రీని పెళ్లి చేసుకుంటానని వచ్చే వాళ్ళెవరుంటారు?''

''నేనున్నానండి! మీ కభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని పెళ్లిచేసుకుంటాను. పువ్వుల్లో పెట్టి పూజిస్తాను... మీ గురించి తెలిసినప్పట్నించి నా హృదయం మీమీద సానుభూతితో ద్రవించిపోయింది. మీకు జరిగిన అన్యాయాన్ని తొలగించి మళ్లీ మీ జీవితం చిగురించాలని కోరుకున్నాను''

అతని మాటలు వింటోంటే ఆమె హృదయం ఏదో పిచ్చి ఆనందంతో ఎగిరి గంతులు వేసింది. ఏదో పారవశ్యం ఆమెను ఆక్రమించుకుంది. అంటున్నాడేగానీ నిజంగా చేసుకుంటాడా?

''మీరు నమ్మండి, నమ్మకపోండి... నేను మిమ్మల్ని ప్రేమించాను. మీ కోసం ఎంత త్యాగమైనా చేస్తాను. చెప్పండి నన్ను చేసుకోవడానికి మీకేమైనా అభ్యంతరమా?'' అన్నాడతడు ఆమెకు చాలా దగ్గరగా వచ్చి.

ఆమె వెంటనే ఏమీ చెప్పలేకపోయింది. ఆమె గొంతులోంచి మాటలు రావడం లేదు. ఏదో పిచ్చి ఆనందం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆమె మౌనాన్ని అంగీకారంగా తీసుకున్న అతడు ఆమె భుజంమీద చెయ్యేసి ఆమెను తన వైపుకు తిప్పుకోబోయాడు.

ఆమె వెంటనే దిగ్గున లేచింది.

''మీరు మా అమ్మతో మాట్లాడండి. పెళ్ళి చేసుకునేదాకా మీరు నా వంటిమీద చెయ్యేసారంటే బావుండదు. నాది చాలా పిచ్చికోపం'' అందామె.

అతడు వెంటనే వెనక్కి తగ్గాడు.

''నన్ను క్షమించు సరోజా! ఆవేశంలో తొందరపడ్డాను. నువ్వన్నట్టే నిన్ను పెళ్లి చేసుకునేదాకా నిన్ను తాకను. సరేనా?'' అంటూ అతడు బయటికెళ్లిపోయాడు.

ఆ తర్వాత ఐదురోజుల దాకా రాఘవులు సరోజకు కనిపించలేదు. ఎప్పుడో అర్ధరాత్రి వచ్చి పొద్దున్నే వెళ్లిపోయేవాడు. రాధమ్మ ఊర్నించి రాగానే సరోజ నడిగింది.

''రాఘవులు అదోమాదిరిగా ఉంటున్నాడేమిటి? ఈ రోజు నేను లేచేటప్పటికే వెళ్లిపోయాడు. ఈ నాలుగు రోజులూ మనింట్లో తినలేదా?''

''లేదు'' అంది సరోజ.

''ఏం? మీమధ్య ఏమన్నా గొడవ జరిగిందా?''

'ఏం గొడవ జరుగుతుంది?''

''ఏదన్నా జరుగుంటుంది. అతన్ని నువ్వేమన్నా అన్నావా?''

''నేనేమంటాను?''

''ఏదోజరిగింది. నాతో చెప్పకపోతే ఎవరితో చెబుతావే?''

''అతడు నన్ను పెళ్ళి చేసుకుంటాట్ట''

వెంటనే రాధమ్మ మొహం వికసించింది.

''నే చెప్పలేదూ. నేనేనాడో గ్రహించాను అతనికి నీమీద మనసుందని... అయితే నువ్వేమన్నావు?''

''ఏమీ అనలేదు - మా అమ్మతో మాట్లాడమన్నాను. అప్పుడే పెళ్లయి పోయినట్టు మీద చెయ్యేశాడు. పెళ్లికాకుండా ఇలాంటి పనులు చేస్తే బావుండదని గట్టిగా మందలించాను''

''ఛీ! నీకు బుద్ధిలేదే. చెయ్యేసినంత మాత్రాన నీకేమయింది? అతన్నెందుకు నొప్పించావు. మొగుడు చచ్చి ముండమోసిన నిన్ను చేసుకుంటానని ఎవరొస్తారే? అతడేదో అమాయకుడు, బుద్ధిమంతుడు కాబట్టి నిన్ను చేసుకుంటానన్నాడు. అలాంటివాణ్ని నొప్పిస్తే అతడు మళ్లీ నీ మొఖం చూస్తాడా? ఎంత పాడుపని చేశావే! అందుకే అతడలా పొద్దున్నే నాతో మాట్లాడకుండా వెళ్లిపోయాడు. నువ్విలా చేస్తావని నీకు మొదలే చెప్పానే - అతడు అడిగినప్పుడు బెట్టు చెయ్యకుండా వెంటనే ఒప్పుకోమని''

ఆ రోజంతా రాధమ్మ ఈ ధోరణిలోనే మాట్లాడింది.

'ఈ కోపగొండిది అతణ్ణి ఎన్ని మాటలందో, ఎంత అవమానించిందో! రేపో మాపో అతడు ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోతాడు. ఎలాగైనా అతణ్ణి ఆపాలి. జరిగిందానికి క్షమాపణ చెప్పుకోవాలి. ఇద్దరికీ పెళ్లిచేసి దాని మొహాన మళ్లీ పసుపు కుంకుమల్ని చూడాలి' అనుకుంది రాధమ్మ.

ఆరోజు రాత్రి రాఘవులు షాపునుండి రాగానే రాధమ్మ అతని రూమ్‌లో కెళ్లింది.

''ఏం నాయనా? నాలుగైదు రోజులుగా కనిపించకుండా తిరుగుతున్నావట! మా సరోజ ఏమన్నా అందా?'' అంది రాధమ్మ.

''ఏమీ అనలేదండి. నా మనస్సే బాగాలేక...'' అన్నాడు రాఘవులు.

''దానిక్కొంచెం ఆవేశం ఎక్కువ నాయనా! అదేమన్నా అంటే మనసులో పెట్టుకోకు. దాన్ని పెళ్లి చేసుకుంటానన్నావట గదా! అంతకంటే ఇంకేం కావాలి నాయనా? దానికి ఇరవయ్యేళ్లయినా నిండకుండానే పసుపు కుంకమలు కరువైపోయాయి. నీలాంటి బుద్ధిమంతుడు దానికి మళ్లా వాటినిస్తానంటే దాని అదృష్టానికి మురిసిపోవాలి. నువ్వు దాన్ని పెళ్ళి చేసుకుంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు నాయనా. పెళ్ళి చేసుకొని హాయిగా ఇక్కడే ఉండిపొండి. ఈ ఇల్లు నీకే ఇచ్చేస్తాను'' అంది రాధమ్మ.

''నాకు సరోజను చేసుకోవాలనే ఉందండి. కాని వెంటనే చేసుకోవాలంటే కొన్ని సమస్యలున్నాయి. మొన్ననే మా చెల్లి చచ్చిపోయింది. ఆ బాధతోటే మా అమ్మ మంచమెక్కింది. ఇప్పుడు నేనో విధవను పెళ్లి చేసుకున్నానని తెలిస్తే మా అమ్మ గుండెపగిలి చచ్చిపోతుంది. నేను చిన్న ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి నాకు అంతో ఇంతో కట్నమిస్తుందని, మా నాయనగారు చేసిన అప్పులు తీరుస్తానని, మా రెండో చెల్లి పెళ్లి కూడా చేస్తానని మా అమ్మ నామీద ఆశలు పెట్టుకుంది... నాక్కొంచెం టైమివ్వండి. మా చెల్లెలి పెళ్లికాగానే సరోజను చేసుకుంటాను. నేనో విధవరాల్ని చేసుకున్నానని తెలిస్తే మా

చెల్లెలినెవరూ చేసుకోరు. ప్రమాణం చేసి చెబుతున్నాను... నాకొంచెం టైమిస్తే సరోజను తప్పకుండా చేసుకుంటాను'' అన్నాడు రాఘవులు.

''దాందేముంది నాయనా... అలాగే కానీయ్. నీ సమస్యలన్నీ తీరాకే చేసుకో. నిన్ను మాత్రం మేం ఇబ్బందిల్లో పెడ్తామా?'' అంది రాధమ్మ.

''మీరేమి అనుకోకపోతే ఒక్కమాట. ఎట్లాగూ పెళ్లి చేసుకోబోతున్నాం గదా? సరోజ నాతో కాస్త చనువుగా ఉంటే తప్పా?''

''తప్పేంలేదు నాయనా! అది కొంచెం తిక్కమనిషి. నే చెప్పి చూస్తాను... ఎప్పటిలా మా ఇంట్లోనే తినిపో నాయనా!'' అంటూ రాధమ్మ అతనికి అన్నం వడ్డించింది.

ఆరోజు రాత్రి పడుకోబోయేముందు రాధమ్మ సరోజతో చాలాసేపు మాట్లాడింది.

''అతడు నిన్ను పెళ్లి చేసుకుంటానని ప్రమాణం చేసి చెప్పాడే. కొంచెం టైమ్ కావాలన్నాడు. వాళ్లింటిదగ్గర పరిస్థితులు బాగాలేవట. కొంచెం సర్దుబాటు కాగానే చేసుకుంటానన్నాడు'' అంది రాధమ్మ.

సరోజ ఏమీ మాట్లాడలేదు.

''అతనితో ఎప్పుడూ కోపంగా రుసరుసలాడుతూ ఎందుకుంటావే? కాస్త చనువుగా ఉంటే ఏం?'' అంది రాధమ్మ.

''చనువుగా ఉండటమంటే ఏమిటి? అప్పుడే అతనికి పెళ్లాంగా మారిపోమంటావా?'' అంది సరోజ.

''అబ్బబ్బ! నీతో ఏ మాట చెప్పినా కష్టమే. అన్నిటికి పెడర్థాలే తీస్తావు. మొగుడు చచ్చి ముండమోసిన నిన్ను చేసుకుంటానంటున్నాడు. అతనితో...''

''నువ్వు మాట మాటకు నేను మొగుడు చచ్చినదాన్నని గుర్తుచెయ్యాల్సిన అవసరం లేదమ్మా! అతన్ని నన్ను పెళ్లి చేసుకోమని నేనేం కాళ్లావేళ్లా పళ్లేదు. అతనికిష్టమైై నన్ను చేసుకుంటే చేసుకోమను. అంతేగాని పెళ్లిచేసుకోకుండా నా జోలికొస్తే నేనూరుకోను'' అంది సరోజ.

''ఏం చేస్తావు?''

''తగిన శాస్తి చేస్తాను''

''నీకీ జన్మలో బుద్ధిరాదే''

''ఫరవాలేదు. చెడిపోయిన ఆడదానిగా బతకటం కంటే విధవగా బతకడమే నా కెంతో గౌరవంగా ఉంటుంది'' అంది సరోజ.

ఇది జరిగిన రెండు రోజుల తర్వాత కిళ్లీకొట్టు దగ్గర ఆ వాడలో పెద్ద రౌడీ అని పేరుమోసిన నరసింహం సరోజను అవమానించబోయాడు. రాత్రి తొమ్మిది గంటలకు బాగా తాగి కిళ్లీ కట్టమని వచ్చాడు నరసింహం. సరోజ కట్టిచ్చిన కిళ్లీ తీసుకోబోతూ ఆమె

చెయ్యిపట్టి లాగాడు. వాడి చెంప ఛెళ్లుమనిపించింది సరోజ. దాంతో బాగా రెచ్చిపోయిన నరసింహం సరోజను బూతులు తిడుతూ ఆమె కొంగుపట్టి లాగబోయాడు. సరోజ వెంటనే ఇంట్లోకి పరుగెత్తింది. వాడు కిళ్ళీకొట్టునంతా నాశనం చేస్తూ నోటికొచ్చిన తిట్లల్లా తిట్టాడు. వాటి కేకలకు అక్కడి చుట్టుపక్కలవాళ్లంతా అక్కడ గుమికూడారు.

''కిళ్లీ తీసుకోబోతూ చెయ్యి తగిలినంత మాత్రాన ఇది నన్ను కొడ్తుందా? దీని బతుకెవరికి తెలవదని. బట్టలషాపు వాణ్ని ఇంట్లో పెట్టుకుని కులికితే తప్పు లేదు. పొరపాటున చెయ్యి తగిలితే పెద్ద పతివ్రతలా నన్ను కొడుతుందా... దీన్ని నడిబజార్లో...''

వాడు అన్నవమాటే మళ్లీమళ్ళీ అంటూ ఓ అరగంటసేపు అక్కడ భీభత్సాన్ని సృష్టించాడు. రాధమ్మ వచ్చి ''ఏదో తప్పైపోయింది నాయనా... అదే తొందరపడింది'' అని బతిమాలాకగాని వాడక్కణ్ణించి కదలాడు కాదు. అక్కడ గుమికూడిన వాళ్లల్లో ఎవరూ వాడిని ఎందుకలా తిడుతున్నావని అడిగిన పాపాన పోలేదు. పైగా ''చెయ్యి తగిలినంత మాత్రాన అంత రౌడీగాణ్ని కొడ్తుందా? అంత రోషం గలదయితే షాపెందుకు పెట్టాలి?'' అన్నారు కొందరు. ''లోకం కళ్ళు ఎంతకాలం మూస్తారు? వాడెవడో బట్టలకొట్లో పనిచేసేవాణ్ని ఇంట్లోనే తెచ్చిపెట్టుకున్నారటగా'' అన్నారు మరికొందరు.

సరోజ ఇంట్లోకెళ్లి చాలాసేపు ఏడుస్తూ పడుకొంది. వాడన్న ఒక్కొక్కమాట... వాడు తిట్టిన ఆ భయంకరమైన తిట్లు ఆమె గుండెల్లో గునపాల్ని గుచ్చాయి. తనకో మొగదిక్కంటూ లేకపోవడంవల్లనే వాడు తనను అన్ని తిట్లు తిట్టగలిగాడటు. తాను ఎంత నీతిగా బతుకుతున్నా ఈ సమాజం గుర్తించదు. పెళ్లాం, పిల్లలు లేని రాఘవులుకు ఇల్లివ్వటం చాలా పెద్ద పొరపాటే అయిపోయింది. ఈరోజు అతని సంగతేమిటో తేల్చుకోవాలి.

బయటంతా సద్దుమణిగాక ఇంట్లో కొచ్చిన రాధమ్మ కూడా తన కూతురుదే తప్పన్నట్టుగా మాట్లాడింది.

''ఆ రౌడీగానితో గొడవేమిటి? వాడేమన్నా అంటే చూసీ చూడనట్టూర్కోవాలి. దిక్కులేని వాళ్లకు రోషముండకూడదే... బయట జనం కూడా మనదే తప్పంటున్నారు. అంత రోషం గలవాళ్లు షాపెందుకు పెట్టుకోవాలి అంటున్నారు'' అంది రాధమ్మ.

రాత్రి పదిగంటలకు రాఘవులొచ్చాడు. ఎక్కడో తినొచ్చానని, తనకు భోజనం అక్కర్లేదని చెప్పాడు.

అందరూ నిద్రపోయాక సరోజ రాఘవులు గదికొచ్చి అతన్ని నిద్రలేపింది.

''ఏమిటిలా వచ్చారు?'' అన్నాడతడు ఆశ్చర్యంగా.

''నిజం చెప్పండి... నాటకాలాడకండి. నన్ను నిజంగా పెళ్ళి చేసుకుంటారా?'' అంది సరోజ.

ఆమె కంఠంలో ధ్వనించిన తీవ్రత అతన్ని భయపెట్టింది.

''ఆ విషయం... ఇప్పుడు ఈ అర్ధరాత్రి...'' అతడు తటపటాయించాడు.

''అదంతా అనవసరం. నిజం చెప్పండి. ఇప్పుడే చెప్పండి. మీరు నన్ను పెళ్లి చేసుకుంటారా... లేదా?''

''చేసుకుంటాను. తప్పకుండా చేసుకుంటాను. కాని కొంచెం టైమ్ కావాలి''

''ఎందుకు?''

''మా చెల్లెలి పెళ్లికాకుండా నేను నిన్ను చేసుకున్నానని తెలిస్తే ఇదివరకే మంచం పట్టిన మా అమ్మ హార్ట్ ఫెయిలయి చస్తుంది. పైగా నేను నిన్ను చేసుకున్నానని తెలిస్తే మా చెల్లెల్ని ఎవరూ చేసుకోరు. అందువల్ల మా చెల్లెలు పెళ్లయ్యేదాకా టైమిస్తే...''

''అలా అయితే మీరు రేపే ఈ రూమ్ ఖాళీ చేసి వెళ్లిపోండి. మళ్లీ ఇక్కడ కనిపించొద్దు...''

''అంత ఘోరంగా మాట్లాడితే ఎలా?''

''మిమ్మల్నొక్కర్నే ఈ రూమ్‌లో ఉండనివ్వడం చాలా బుద్ధితక్కువ పనైపోయింది. మనిద్దర్ని గురించి ఈ వాడలో రకరకాలుగా అనుకుంటున్నారు''

అతడొక్క క్షణంసేపు ఆలోచించాడు.

''ఒక పని చేద్దాం... రేపే మనిద్దరం యేదన్నా గుడికెళ్ళి పెళ్లి చేసుకుందాం. కాని, కొద్ది రోజులు మన పెళ్లిని రహస్యంగా ఉంచుదాం. మా చెల్లె పెళ్లి కాగానే నిన్ను మా ఇంటికి తీసుకెళ్తాను''

''మీరు నన్ను మీ ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. ఈ వాడలో మీరు నన్ను పెళ్లిచేసుకున్నట్టు తెలిస్తే చాలు''

''అలాగైతే రేపే మనం పెళ్లి చేసుకుందాం'' అన్నాడు రాఘవులు. ఆమెమీద చెయ్యేసి ఆమెను తనవైపు లాక్కోబోయాడు.

''రేపటిదాకా ఆగండి'' అందామె – అతన్ని విదిలించుకుని బయటకొస్తూ.

తన గదిలోకొచ్చి పడుకుందేగాని ఆ రాత్రంతా సరోజకు నిద్రరాలేదు. తనెంత స్వచ్ఛంగా, నీతిగా బతికినా సమాజం తనమీదో ముద్రను వెయ్యనే వేసింది. అవమానించింది. ఈ సమాజానికి భయపడ్తున్నంత కాలం ఇంకా భయపెట్టించు కుంటుంది. తను రాఘవుల్ని పెళ్లాడి వీళ్లందరి నోళ్ళు మూయించాలి. రాఘవులు చెడ్డవాడేం కాదు. రెండు నెలలుగా అతన్ని గమనిస్తోంది. తనపై అతనికి నిజంగానే మనసుంది. అతన్నిప్పుడు కాదంటే మరోసారి తనకిలాంటి అవకాశం రాకపోవచ్చు. రహస్యంగా గుళ్ళో పెళ్లి చేసుకున్నంత మాత్రాన అతడు తనను మోసం చేస్తాడా? మోసం చేసి ఎక్కడికెళ్తాడు? ఎక్కడికెళ్లినా అతన్ని తను పట్టుకోగలదు.

ఆ మర్నాడు రాఘవులు, సరోజ, రాధమ్మ భద్రకాళి గుడికెళ్లారు. అక్కడి పూజారి

సమక్షంలో రాఘవులు సరోజ మెడలో తాళి కట్టాడు.

ఆ రోజునుండి సరోజ, రాఘవులు భార్యాభర్తల్లా జీవించసాగారు. రాఘవులు రెండు నెలలుగా అణచుకున్న కోరికను ఆ రాత్రి ఆమెతో తీర్చుకున్నాడు. ఆ రాత్రేకాదు... అప్పట్నించి ప్రతి రాత్రీ ఆమె శరీరంతో ఆడుకున్నాడు. కలలో కూడా ఊహించని స్వర్గసుఖాల్ని అనుభవించాడు.

తను రాఘవుల్ని పెళ్లి చేసుకున్నట్టు ఆ వాడలో అందరికీ తెలిసేలా ప్రవర్తించింది సరోజ. మెడలో తాళి, నొసటన బొట్టు చూసి ఆ వాడలోని ఆడవాళ్లంతా కకనుబొమ్మలెగరేశారు. - ''మనం అనుకున్నంతా అయ్యింది'' అని నోళ్లు నొక్కుకున్నారు.

సరోజను పెళ్లి చేసుకున్నాక రాఘవులు ఆర్థిక పరిస్థితి కూడా మెరుగయ్యింది. మంచి బట్టలు కుట్టించుకున్నాడు. వారం రోజులకొకసారి వాళ్ళూరు వెడ్తున్నానని చెప్పినప్పుడు 'మీ అమ్మకూ, చెల్లెలుకూ ఏదైనా తీసుకెళ్లండ'ని సరోజ అతని చేతిలో యాభై, నూరు పెడ్తుండేది.

వాళ్ల పెళ్లయిన రెండు నెలల తర్వాత వాళ్ళూరు వెళ్లొచ్చిన రాఘవులు వాళ్ల చెల్లెలికో మంచి సంబంధం కుదిరిందని చెప్పాడు. ఐదువేలు వరదక్షిణ అడుగుతున్నారని, తను నానా తంటాలు పడి తన మిత్రుల దగ్గర్నుండి, యజమాని దగ్గర్నుండి ఓ మూడువేలు సంపాదించానని, ఇంకో రెండువేలుంటే వెంటనే పెళ్లయిపోతుందనీ, మన కష్టాలన్నీ తీరిపోతాయని రాఘవులు సరోజతో చెప్పాడు. రెండేళ్లుగా తన కిళ్లీకొట్టుమీద సంపాదించిన డబ్బంతా... రెండువేలపైచిల్లర రాఘవులు చేతిలో పోసింది సరోజ. ఆ డబ్బు తీసుకున్న మర్నాడే ''మా చెల్లెలు పెళ్లి చేసి వారం పదిరోజుల తర్వాత వస్తాను'' అని చెప్పి రాఘవులు వెళ్లిపోయాడు.

అలా వెళ్లిపోయిన రాఘవులు వారం రోజులు గడిచినా రాలేదు. రెండు వారాలు గడిచినా రాలేదు. రెండో వారం గడిచేంతవరకు వాళ్లకెవళ్లకూ అనుమానం రాలేదు. మూడు వారాలుకూడా గడిచిపోయాక సరోజ వాళ్ల తమ్ముడ్ని ఉపేంద్రయ్య బట్టలషాపుకు రాఘువుల్ని గూర్చి తెలుసుకొనిరమ్మని పంపించింది.

ఆ కుర్రాడు తిరిగొచ్చి చాలా దారుణమైన వార్త చెప్పాడు.

''ఆయన్ను నెల రోజుల క్రితమే వాళ్ల షాపు డబ్బు వాడుకున్నాడని ఉద్యోగంలోంచి తీసేశారట. రాఘవులుకు ఆ షాపులో ఉద్యోగమిప్పించిన సాంబయ్య అనే ఆయన్ను కూడా తొలగించారట. రాఘవులు విషయం మాకేమీ తెలియదన్నారు'' అన్నాడు సరోజ తమ్ముడు మురళి.

ఆ తర్వాత మురళిని రాఘవులు వాళ్ల ఊరుకు పంపించారు. ఆ ఊర్నించి తిరిగొచ్చి ''ఆ ఊళ్ళో రాఘవులనే మనిషే లేడట... మిమ్మల్నెవరో మోసం చేసినట్టుంది అన్నారు ఆ ఊరివాళ్లంతా'' అని చెప్పాడు మురళి.

అప్పుడుగాని సరోజకు అతడు తననెంత తెలివిగా మోసం చేశాడో అర్థమైంది. అయినా అతన్ని తనేమీ చెయ్యలేదు. అతనెక్కడున్నాడో తెలుసుకోలేదు. తన అశక్తత పట్ల ఆమె కసహ్యం వేసింది. ''ఎంతో అమాయకుడిలా కనిపించిన వాడింత మోసం చేస్తాడనుకోలేదే'' అంటూ రాధమ్మ కుప్పకూలిపోయింది. ఆరోజునుండి మంచం పట్టిన రాధమ్మ మళ్ళీ లేవలేదు. ఈ విషయం తెలిసిన వాళ్లన్న హడావుడిగా వాళ్లింటికొచ్చి రాధమ్మను, సరోజను ఇంత బుద్ధితక్కువ పనెందుకు చేశారని చెడామడా తిట్టి వెళ్లిపోయాడు.

ఆ వీధిలో ఉన్నవాళ్లందరికీ రాఘవులు సరోజనెలా వంచించాడో అర్థమైంది. అంతకుముందు సరోజను గూర్చి చాటుగా అనుకుంటున్న వాళ్లంతా ఇప్పుడు నేటుగానే అనటం మొదలెట్టారు.

''ఒకడయిపోయాడు... ఇంకెందరొస్తారో...'' అంది సరోజ వాళ్లుంటున్న ఇంటిపక్కనే ఉండే ఓ పెద్దావిడ.

కిళ్లీ కొట్టు దగ్గర సరోజను అవమానించడానికి కాచుక్కూర్చొనే వాళ్ల సంఖ్య పెరిగింది.

''నేను రాఘవులు పాటి చెయ్యలేనా? నాతో వస్తే వాడికంటే బాగానే చూసుకుంటాను'' అనేవాళ్ల సంఖ్య పెరిగింది.

ఆమెనొకసారి అవమానించిన నరసింహం మరోరోజు బాగా తాగొచ్చి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ''నిన్నుంచుకుంటాను రావే! రాఘవులుగాడిలా మధ్యలో వదిలెయ్యను రావే...'' అంటూ మళ్లీ పెద్ద అల్లరి చేశాడు.

అవమానంతో, ఆవేశంతో సరోజ రక్తం సలసల మరిగిపోయింది. వాడిని ముక్కలు ముక్కలుగా నరికెయ్యాలనిపించింది.

కాని ఆమె ఆడది... అందులో మొగదిక్కులేని ఆడది. మొగదిక్కు కోసం తాపత్రపపడి వంచించబడిన ఆడది.

ఆమెను రౌడీబారినుండి రక్షించడానికి ఆ వీధిలో ఎవరూ ప్రయత్నించలేదు. వాడిష్టమొచ్చినంత సేపు ఆమెను తిట్టి, అవమానించి వెళ్లిపోయాడు.

కత్తుల బోనులో ఇరుక్కున్నట్టుగా ఫీలయ్యింది సరోజ.

తనను ప్రతిక్షణం కాకుల్లా, గద్దల్లా పొడుస్తున్న ఆ జనం మధ్య తనిక ఉండలేననిపించింది. వెంటనే ఎక్కడికైనా వెళ్లిపోవాలి.

దిగులుతో మంచంపట్టిన వాళ్లమ్మ శాశ్వతంగా కన్నుమూసింది.

ఆ ఇంటిని ఓ పదివేలకు అమ్మేసి తన తమ్ముణ్ణి వెంటబెట్టుకుని ఆ ఊరు వదిలేసి తనకే తెలీని గమ్యాన్ని వెతుక్కుంట వెళ్లిపోయింది.

* * *

ఐదు సంవత్సరాలు గడిచాయి.

హైదరాబాద్ గౌలిగూడ ప్రాంతంలో పొద్దున్నే కూరగాయలు కొనటానికి వచ్చిన రాఘవులు అక్కడున్న ఓ షాపులో కూరగాయలమ్ముతున్న ఓ ఆడమనిషిని చూసి 'ఇదెవత్తోగాని అచ్చం సరోజలా ఉందే' అనుకున్నాడు. ఆమె సరోజ అవునో కాదో అన్న సందేహంతో ఆ షాపుకింకా కొంచెం దగ్గర్లోకొచ్చాడు.

సందేహం లేదు... ఆమె సరోజే!

అతడికి వెంటనే అక్కణ్నించి పరిగెత్తాలనిపించింది. కాని ఎందుకో అతని కాళ్ళు భూమిలోకి కూడుకుపోతున్నట్లనిపించింది. అతని గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. భయంతో శరీరమంతా వణికిపోసాగింది. అతనిలోని శక్తినంతా కూడతీసుకుని అక్కణ్ణించి కదిలే ప్రయత్నం చేశాడు. కాని అంతలోనే ఆమె అతన్ని చూసింది. వాళ్లిద్దరి చూపులు కలిశాయి.

''రండి... రండి... వెళ్లిపోతున్నారేం?'' అంది సరోజ.

అతడు తనను కాదనుకొని అక్కణ్నించి కదలబోయాడు.

''రాఘవులుగారూ! మిమ్మల్నేనండీ పిలుస్తోంది. అలా వెళ్లిపోతున్నారేమిటి? నన్ను గుర్తుపట్టలేదా?'' అంది సరోజ.

''అరే! నువ్వా సరోజా! నేను గుర్తుపట్టనేలేదు సుమా! బావున్నావా? వరంగల్‌ను వదిలేశావా యేమిటి ఇక్కడున్నావు?'' ఇక తప్పించుకోటానికి వీల్లేదని గ్రహించాడు రాఘవులు.

''వరంగల్‌నే కాదు... చాలా వదిలేశాను. కూర్చోండి. చాలాకాలానికి కనిపించారు. టీ తెప్పించనా?'' అంది సరోజ పక్కనే వున్న పాత స్టూల్‌ని అతనివైపు జరుపుతూ.

అతడు స్టూల్‌మీద కూర్చున్నాడు. పిచ్చిముండ! శాంతంగానే మాట్లాడుతోందే! అంతా మరచిపోయినట్లుంది. దీంతో ఏం చెప్పాలి! ఏవో పరిస్థితుల ప్రాబల్యంవల్ల అలా వెళ్లిపోయానేగాని నిన్ను మోసం చెయ్యాలని ఎంతమాత్రం కాదని... ఏదన్నా చెప్పాలి.

''వరే కరీంబాయి! ఒక మంచి స్పెషల్ టీ పంపించరా'' అంది అక్కడికి కొంచెం దూరంలో ఉన్న కరీం హోటల్‌నుద్దేశించి.

''నన్ను గురించి ఎంత చెడ్డగా అనుకున్నావో! అసలేమయిందంటే...'' అంటూ చెప్పబోయాడు.

ఆమె కూరగాయలు కొనటానికొచ్చిన వాళ్లతో మాట్లాడుతూ వాళ్లకేం కావాలో ఇస్తోంది.

ఇప్పుడవన్నీ ఎందుకు? మీరు మాత్రం కావాలని చేశారా? మీరు మీ ఊరెళ్లగానే మనిద్దరం పెళ్లి చేసుకున్న విషయం తెలిసి మీ అమ్మ గుండాగి చచ్చిపోయుంటుంది. మీ చెల్లెలి పెళ్లి కూడా నా కారణంగానే ఆగిపోయుంటుంది. దాంతో మీ మనస్సు విరిగిపోయి మళ్లా నా దగ్గరకు రావాలనిపించలేదు..'' చాలా మామూలుగా అంది సరోజ.

''ఔను సరోజా! సరిగ్గా అలాగే జరిగింది...''

''నాకు తెలుసండీ... నేను ఆమాత్రం అర్థం చేసుకోలేననుకున్నారా?'' అంది సరోజ - కరీం పంపించిన టీ గ్లాసు అతని చేతికందిస్తూ...

''ఏమిటి సంగతి! బావున్నారా? మిమ్మల్ని చూస్తే చాలా పెద్దమనుషులై పోయినట్టు కనిపిస్తున్నారు...'' అంది సరోజ అతడు వేసుకున్న చాలా ఖరీదైన దుస్తుల్ని చూస్తూ.

''ఇక్కడ నేనే ఒక బట్టలకొట్టు పెట్టాను. మీ అమ్మావాళ్లు బావున్నారా?'' అన్నాడు రాఘవులు.

''బట్టలకొట్టు పెట్టేశారన్నమాట! బాగా నడుస్తోందా? మా అమ్మ ఇంకెక్కడుంది లెండి. వెళ్లిపోయింది''

''అయ్యో! పోయిందా జబ్బుచేసిందా?''

''ఇప్పుడవన్నీ ఎందుకులెండి. సాయంత్రం మా ఇంటికి రండి. తీరిగ్గా మాట్లాడుకుందాం''

తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడతడు.

సరోజ ఇంకా అందంగానే ఉంది. ఆమెలోని యవ్వనం బిగువు... ఆ మత్తెక్కించే ఆకర్షణ ఏమాత్రంకూడా తగ్గలేదు. అతనికి ఆమెతో గడిపిన ఆ మధురమైన రాత్రులు గుర్తొచ్చాయి. మరోసారి ఆమెతో గడిపే ఛాన్స్ వస్తే వదులుకోకూడదు.

''మీ ఇల్లెక్కడ సరోజా'' అన్నాడు.

''ఇదిగో ఈ సందులో మూడో ఇల్లే! ఆ ఆకుపచ్చ దర్వాజా - అదే మా ఇల్లు. రండి. తీరిగ్గా అన్ని విషయాలు మాట్లాడుకుందాం'' అందామె.

''అన్నట్టు మీ తమ్ముడేం చేస్తున్నాడు?''

''వాడా! ఓ చిన్న ఉద్యోగం చూసుకున్నాడులే. ఇక్కడే కాలేజీలో ప్యూన్‌గా కుదిరాడు''

''మరయితే సాయంత్రం వస్తాను'' అంటూ అతడు లేవబోయాడు.

''రాకరాక వచ్చి వట్టి చేతులతో వెడ్తారా? ఆ సంచిటు ఇవ్వండి'' అంటూ అతని దగ్గర సంచీ తీసుకుని దాన్నిండా కూరగాయలు నింపి అతని చేతికిచ్చింది.

''ఇవి సరిపోతాయా? కుటుంబం పెద్దదేనా? ఎంతమంది పిల్లలు?'' అంది.

సమాధానం చెప్పటానికి కొంచెం ఇబ్బందిపడ్డాడతడు.

''నాకు... నాకు పెళ్లయినట్టు నీకు తెలుసా!''

''ఇందులో పెద్ద తెలుసుకునేదేముంది. ఇంతకాలం పెళ్లి చేసుకోకుండా ఉంటారా?'' అంది సరోజ.

''నీదెంత మంచి మనసు సరోజా?'' ఒక్క క్షణం నిజంగా చలించిపోయాడతను.

''పోనీయ్‌లెండి... మీ భార్య బావుంటుందా?''

''ఛీ! ఏం బావుండదు! నిజం సరోజా! నీ అంత అందమైంది... నీ అంత మంచిది ఎవరూ ఉండరు''

''ఊరికే ఎందుకు పొగుడుతారులెండి. సాయంత్రం వస్తారుగా... మా తమ్ముడు కూడా ఊళ్లో లేడులెండి...'' అంది మళ్లీ.

''తప్పకుండా వస్తాను'' అంటూ అతడక్కణ్నించి కదిలాడు.

* * *

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలకు రాఘవులు సరోజింటికి వచ్చాడు. మల్లెపువ్వులా మెరుస్తున్న లాల్చీ, పైజామా వేసుకున్నాడు. లాల్చీ జేబులో ఓ మల్లెపూదండను కూడా వేసుకున్నాడు.

సరోజ ఆరోజు కాస్త త్వరగా షాపు మూసేసి ఇంటికొచ్చి, అన్నం, చేపలకూర వండి, స్నానం చేసి ఉన్నవాటిల్లో కాస్త మంచి చీరె, జాకెట్ వేసుకుని, మొహానికి పౌడర్ రాసుకుని అతని కోసం ఎదురుచూడగానే అతడొచ్చేశాడు.

రాఘవులు రాగానే ఇద్దరికీ అన్నం వడ్డించింది.

ఇద్దరూ చెరోపక్క కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేయసాగారు.

''నీనుండి వెళ్లిపోయానేగాని నిన్ను తలుచుకోని రోజంటూ లేదంటే నమ్ము సరోజా! నిన్ను ఎంతగా జ్ఞాపకం చేసుకున్నానో... ఎన్నిసార్లు నీ దగ్గరకొచ్చి నిన్ను క్షమించమని వేడుకుందామనుకున్నానో చెబితే నమ్మవు....'' అన్నాడతను.

''మీ మాట ఏది నమ్మలేదని...'' అందామె.

భోజనం పూర్తిచెయ్యగానే అతడు మంచంమీద పడుకున్నాడు – ''ఎంత కాలానికి ఇంత మంచి భోజనం చేశానో... ఇప్పుడు చేసుకున్నది వట్టి గయ్యాళిముండ. దాన్ని చేసుకుంటే బాగా డబ్బొస్తుందని ఆశపడి చేసుకున్నాను. చూడటానికి దయ్యంలా ఉంటుంది... దాని దగ్గర పడుకోవాలంటే చలిజ్వరం వచ్చినట్టుగా ఉంటుంది. రా సరోజా! మళ్లీ ఎంతకాలానికో నాకీ సుఖం...'' అన్నాడతను ఆమెకోసం చెయ్యి చాస్తూ.

తనతో ఈ రాత్రి గడపటానికే తనను ఆహ్వానించింది. తమ్ముణ్నేదో ఊరికి పంపించింది. ఆడదంటే ఇంతే... ప్రేమించిందంటే పిచ్చిగా ప్రేమిస్తుంది. ఎంత మోసం చేస్తే అంత ఎక్కువగా ప్రేమిస్తుంది. నాటికి, నేటికి దీని యౌవనాన్నంతా తనిప్పుడు జుర్రుకోబోతున్నాడు... దీన్ని పెళ్లి చేసుకున్నాక ఆ రెండు నెలలు దీంతో అనుభవించినంత సుఖాన్ని మళ్ళీ ఎన్నడూ అనుభవించలేదు.

''మీకు మీరాపానంటే చాలా ఇష్టం కదూ! తెస్తానుండండి'' అంటూ ఆమె గదిలోకెళ్లింది. ఓ నిముషం తర్వాత ఆమె లోపల్నుంచి ఓ సీసా పట్టుకుని అతను పడుకున్న

మంచం దగ్గరకొచ్చింది.

ఏదో తాగడానికి తెచ్చిందనుకున్నాడతడు.

''ఏమిటది?'' అన్నాడతను లేచి కూర్చుంటూ.

''ఏమిటా? నీ పాపపరిహారం'' అంటూ మరుక్షణంలో ఆ సీసాలో ఉన్న సల్ఫ్యూరిక్ ఆసిడ్‌ను అతని ముఖం మీదకు గుమ్మరించింది.

భయంకరమైన బాధతో మెలికలు తిరిగిపోతూ ''అమ్మా'' అంటూ అరిచాడతను.

అతని మొఖమంతా కాలిపోయింది. రెండు కళ్ళూ మాడిపోయాయి.

''చచ్చాన్రో నాయనోయ్'' అంటూ ఆ మంచంమీద పడి తల కోసేసిన కోడిపుంజులా కొట్టుకోసాగాడు.

''రాక్షసుడా! ఆడదాని జీవితంతో ఆడుకుంటావురా! ఆడదంటే ఏమిటనుకున్నావురా? ఎంత ప్రేమిస్తుందో అంత ద్వేషిస్తుంది. పగపట్టిందంటే తాచుపాము పగరా... ఐదేళ్ళుగా నీ కోసం వెతుకుతున్నారా? ఈనాటికి దొరికావు... మరోసారి నా అందాన్ని జుర్రుకోవాలని ఆశపడ్డావు! అనుభవించరా... జీవితాంతం నన్ను జ్ఞాపకం చేసుకుంటూ అనుభవించు'' అంటూ అపరకాళికాదేవిలా అరిచిందామె. ★

'విపుల' నవంబర్ 1982